ప్రజాశక్తి
శనివారం 15 జూన్ 2024 | 5 | అనంతపురం

విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

విద్యుత్ సమస్యను పరిష్కరించండి

◆ డి-3 కార్యాలయాన్ని ముట్టడించిన సిపిఎం నాయకులు
◆ సమస్యలు పరిష్కరిస్తామని అధికారుల హామీ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నగరపాలక సంస్థ పరిధిలోని 49వ డివిజన్‌లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నగర 1వ కమిటీ ఆధ్వర్యంలో బళ్ళారి బైపాస్ వద్ద ఉన్న డి-3 కార్యాలయాన్ని సిపిఎం నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ముట్టడించారు. కార్యాలయంలో లోపలికి వెళ్లి బైటాయించి ఆందోళన నిర్వహించారు. అధికారుల నిర్లక్ష్య వైఖరి వీడాలంటూ నినదించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ 49వ డివిజన్, ఇందిరానగర్ పరిధిలో విపరీతమైన కరెంట్ సమస్య ఉందన్నారు. అధికారుల దష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లిన సమస్యను పరిష్కరించడంలో వైఫల్యం చెందారని విమర్శించారు. చిన్నపాటి వర్షం వచ్చిన ఒక రోజంతా ఇందిరానగర్‌లో కరెంటు పోతుందన్నారు. దీనితో కాలనీవాసులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తక్షణమే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సమస్యపై స్పందించిన ఏఈ రామాంజనేయులు

విద్యుత్ అంతరాయం తదితర సమస్యల పరిష్కారానికి సిపిఎం నేతలు చేపట్టిన ముట్టడి నేపథ్యంలో డి-3 కార్యాలయం ఏఈ రామాంజినేయులు స్పందించారు. పరిశీలించి తక్షణమే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. మిగిలిన పనులను వారం రోజు లోపల పూర్తి చేస్తామని హామీ ఇవ్వడంతో నాయకులు ఆందోళన విరమించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నందుకు ఏఈ రామాంజినేయులకు సిపిఎం నేతలు ధన్యావాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు ప్రకాష్, మసూద్, రాజు, డేవిడ్, రామాంజి, అంజి, మోహన్, ఇందిరానగర్ కాలనీవాసులు మూర్తమ్మ, రాముడు, బాబు, అల్లాబకాస్, ముస్తఫా, మాబాషా, రహమతుల్లా, ఇలియాజ్, రాధమ్మ, లాలు, నాగేంద్ర, సాయి తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం ఆందోళన అనంతరం స్పందించి ఇందిరానగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

అమాత్యుల శాఖల్లో..

అనంతకు ప్రాధాన్యత

పయ్యావుల కేశవ్
ఆర్థిక, ప్రణాళిక వాణిజ్య పన్నుల శాఖలు

సత్యకుమార్ యాదవ్
ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖలు

ఎస్.సవితమ్మ
బిసి సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం, చేనేత శాఖలు

◆ మూడూ ముఖ్యమైన పదవులే
◆ పయ్యావుల కేశవ్‌కు ఫైనాన్స్..
◆ సత్యకుమార్‌కు వైద్య ఆరోగ్యం
◆ సవితమ్మకు బిసి సంక్షేమం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

రాష్ట్ర మంత్రి వర్గంలో మంత్రులకు శాఖల కేటాయింపులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు ప్రాధాన్యత దక్కింది. ఇప్పటి వరకు దక్కని అత్యంత ప్రాధాన్యమైన మంత్రి పదవులు ఈసారి జిల్లాకు దక్కాయి. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు ఆర్థిక శాఖను కేటాయించారు. ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్‌కు విద్యా, వైద్య శాఖ, పెనుకొండ ఎమ్మెల్యే సవితమ్మకు బిసి సంక్షేమ శాఖను కేటాయించారు. ఉమ్మడి జిల్లాకు ఇంతటి ప్రాధాన్యమైన పోర్టుపొలియోలు దక్కడం ఇదే ప్రథమమని చెప్పవచ్చు.

పయ్యావుల కేశవ్‌కు ఆర్థిక శాఖ

ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ 1994 నుంచి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటికీ మొదటిసారి తప్ప తక్కిన అన్నిసార్లు ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందిన సమయాల్లో ప్రభుత్వం అధికారంలో లేదు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందిన సమయంలో శాసనసభలో తనదైన వాణిని గట్టి వినిపించి ప్రభుత్వాలను ఇరుకునపెట్టేవారు. మంచి వాగ్ధాటి కలిగిన ఆయనకు మంత్రివర్గంలో చోటు తొలిసారిగా లభించింది. అది కూడా ఆర్థిక శాఖ లభించడం గమనార్హం. 2019 నుంచి ఆయన పిఎసి ఛైర్మన్‌గా (ప్రజాపద్దుల కమిటీ)కి వ్యవహరించారు. ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వంలోని ఆర్థిక క్రమశిక్షణ లోపాలను ఎత్తిచూపారు. ఈ అనుభవం ఇప్పుడు ఆయన ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేయడానికి ఎంతగానో దోహదపడనుంది. ఏదిఏమైనా ఆర్థికశాఖ మంత్రిగా జిల్లాకు తొలిసారిగానే ఈపదవి దక్కిందని చెప్పవచ్చు. ఈయన జిల్లా అభివృద్ధి ఏ మేరకు దోహదపడగలరో చూడాల్సి ఉంది.

సత్యకుమార్‌కు వైద్యశాఖ

కూటమిలో భాగంగా బిజెపి తరుపున ఎమ్మెల్యే టిక్కెట్టు దక్కించుకుని ధర్మవరం నుంచి గెలుపొందిన సత్యకుమార్ తొలిసారిగా ఎమ్మెల్యే అయ్యారు. అంతేకాకుండా మంత్రివర్గంలోనూ చోటు దక్కించుకున్నారు. ఆయనకు వైద్యశాఖను కేటాయించారు. ఇది కూడా అత్యంత ప్రాధాన్యతమైన పదవే కావడం గమనార్హం. ప్రజారోగ్యా పరిరక్షణకు ఆయన ఏ మేరకు కృషి చేయగలరన్నది చూడాల్సి ఉంది.

సవితమ్మకు బిసంక్షేమం,చేనేత

పెనుకొండ నుంచి గెలుపొందిన సవితమ్మ బిసి సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడి వర్గాలు, చేనేత జౌళి శాఖ మంత్రిగా నియమితులయ్యారు. ఈమె కూడా తొలిసారిగా ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలుపొందడమే కాకుండా బిసి సంక్షేమం, చేనేత శాఖ దక్కింది. ఈ జిల్లాలో బిసిలు, చేనేతలు అధికంగానున్నారు. వీరికి అనేక సమస్యలున్నాయి. వీటికి ఏ మేరకు పరిష్కారం చూపగలరో చూడాల్సి ఉంది. ఈమె కూడా రాజకీయ నేపథ్యమున్న కుటుంబం నుంచే వచ్చారు. తండ్రి రామచంద్రారెడ్డి మంత్రిగానూ, పార్లమెంటు సభ్యులుగానూ పనిచేశారు. దీంతో రాజకీయపరమైన అంశాలపై స్పష్టత ఉంది. పైమూడు పదవులు అత్యంత ప్రాధాన్యమైనవి కావడంతో జిల్లా అభివృద్ధికి ఏ మేరకు దోహదపడగలన్నది చూడాల్సి ఉంది.

నీట మునిగిన పత్తి పంటను చూపిస్తున్న రైతులు

తడిసి మొలకెత్తిన పత్తి పంటను ఆరబెట్టిన రైతులు

ఎడతెరిపి లేని వర్షాలతో పత్తి పంటకు నష్టం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల వ్యాప్తంగా చాలా గ్రామాల్లో ఎక్కువ మంది రైతులు బోరు బావుల కింద పత్తి పంట సాగు చేశారు. అయితే పత్తి కాయ పగిలే సమయంలో వర్షాలు ఎడతెరిపి లేకుండా కురవడంతో పంట పొలాల్లో నీరు నిలిచి చెట్లు కుళ్లిపోయి, కాయలు ఊడి పోయాయి. మండలంలోని ఉద్దేహాల్, ఉంతకల్, శ్రీధరగట్ట, ఉప్పరాల, గోనెహాల్, బండూర్, దేవగిరి, గోవిందవాడ, కల్లుహోల, బొల్లనగుడ్డం, లింగదహాల్ గ్రామాల్లో ఎక్కువ మంది పత్తి పంట సాగు చేయగా వర్షాల వల్ల నష్టపోయారు. ఎకరాకు రూ. 20వేల నుంచి రూ. 40 వేల వరకూ ఖర్చు చేయగా పంట చేతికందే సమయంలో వర్షాలు ముంచెత్తాయని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు లింగప్ప, శివన్న, సిద్ధలింగ, తిప్పేస్వామితో పాటు మరికొందరు కోరుతున్నారు. పంట నష్టంపై తహాశీల్దార్, వ్యవసాయ శాఖ అధికారులకు వినతులు సమర్పించామని వారు తెలిపారు.

పకడ్బందీగా సివిల్ సర్వీసెస్ పరీక్షలు

◆ అనంతలో 7 కేంద్రాలు ◆ కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈ నెల 16న జిల్లాలో జరగనున్న సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్షలు - 2024ను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్షలు - 2024పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్షలను నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్షలను జూన్ 16వ తేదీ ఆదివారం జరుగుతాయన్నారు. పరీక్షలకు 2,795 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. ఉదయం 9:30 గంటల నుంచి 11:30 గంటల వరకు పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 4:30 గంటల వరకు పేపర్-2 పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం జిల్లా కేంద్రంలో ఏడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అన్ని వసతులూ ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులు ఇతర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి చేరుకునేందుకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షలకు సంబంధించి అనంతపురం కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఏవైనా సమస్యలుంటే కంట్రోల్ రూమ్ సెల్ నెంబర్ 8500292992ను అభ్యర్థులు ఉపయోగించుకోవాలన్నారు. కంట్రోల్ రూమ్ ఈనెల 15, 16వ తేదీలలో రెండు రోజులపాటు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6:00 వరకు పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, సివిల్ సర్వీసెస్ జిల్లా తనిఖీ అధికారి హిమాంశు కుమార్, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి,.అడిషినల్ ఎస్పీ విజయభాస్కర్ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రక్తదానంపై విద్యార్థుల ర్యాలీ

ప్రజాశక్తి-బొమ్మనహాల్

'ప్రపంచ రక్తదాన దినోత్సవం' సందర్భంగా శుక్రవారం బొమ్మనహాల్‌లో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులు రక్తదానంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. వైద్య సిబ్బంది మాట్లాడుతూ 16 నుంచి 50 ఏళ్ల వరకూ ప్రతిఒక్కరూ ఏడాదిలో రెండు సార్లు ర్తదానం చేయవచ్చన్నారు. తద్వారా కొత్త రక్తం ఉత్పత్తి అవడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. రక్తదానం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడిన వారవుతారని గుర్తుచేశారు. రక్తదానంపై ఎలాంటి అపోహలు అవసరం లేదని, ఆరోగ్యంగా ఉన్న ప్రతిఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, నర్సు జైనబి, గోవర్ధన్, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాతకు సత్కారం

రక్తదాత వీరన్నకు అవార్డు అందజేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-రాయదుర్గం

'ప్రపంచ రక్తదాన దినోత్సవం' సందర్భంగా అనంతపురం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎక్కువ సార్లు రక్తదానం చేసిన వారికి, రక్తదాన శిబిరాలు నిర్వహించిన వారికి అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ డాక్టర్ వి.వినోద్‌కుమార్, అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, ఛైర్‌పర్సన్ కాపు భారతి, స్టేట్ మేనేజింగ్ కమిటీ మెంబర్ కాపు రామచంద్రారెడ్డి హాజరయ్యారు. వీరి ఆధ్వర్యంలో రక్తదాతలను ఘనంగా సన్మానించి అవార్డు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా రాయదుర్గం ప్రాంతానికి చెందిన ఎంజి.వీరన్నను రెడ్ క్రాస్ సొసైటీ తరపున సత్కరించారు.

కళ్యాణదుర్గం : అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం కళ్యాణదుర్గం రక్తదాతల వ్యవస్థాపకుడు కంబాల తిమ్మారెడ్డి కలెక్టర్, రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్‌పర్సన్ కాపు భారతి, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి నుంచి ఉత్తమ రక్తదాన సేవకుడి అవార్డు అందుకున్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

బ్రహ్మసముద్రం : బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు రామాంజనమ్మ, కాసింబీ సూచించారు. మండలంలోని బ్రహ్మసముద్రం, నంజపురం, వేపులపర్తి-1, 2, 3 తదితర గ్రామాల్లో శుక్రవారం అంగన్వాడీ బడిబాట, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఐదేళ్లు నిండిన పిల్లలను అదే గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని, మూడేళ్లు నిండిన చిన్నారులను పూర్వ ప్రాథమిక కేంద్రం(అంగన్వాడీ కేంద్రం)లో చేర్పించాలని తెలిపారు. పిల్లల సమగ్రాభివృద్ధితో పాటు వారి వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలను మెరుగుపరచడమేనని ఐసిడిఎస్ శాఖ ముఖ్య ఉద్దేశం అన్నారు. 'ప్రభుత్వ పాఠశాలే ముద్దు.. ప్రయివేట్ పాఠశాల వద్దు' ప్లకార్డులు చేతబూని గ్రామవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

త్వరలో అన్న క్యాంటీన్ ప్రారంభిస్తాం

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

పట్టణంలో అతి త్వరలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. ఎమ్మెల్యే శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి ఆర్అండ్‌బి అతిథి గృహం ముందు బళ్లారి రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్ భవనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో ఎలాంటి అభివృద్ధి చేయకపోగా పేదలకు అన్నం పెట్టే అన్నా క్యాంటీన్లను ఆపేసిన అసమర్థ చేతకాని ప్రభుత్వమని విమర్శించారు. టిడిపి అధినేత చంద్రబాబు సిఎంగా ప్రమాణస్వీకారం చేసిన 24 గంటల్లోనే చరిత్రలో నిలిచిపోయేలా 5 ఫైళ్లపై సంతకాలు చేశారని, అందులో అన్నా క్యాంటీన్ పునఃప్రారంభం ఫైల్‌పై సంతకం చేయటం హర్షణీయమన్నారు. అన్నా క్యాంటీన్ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి జూలై ఆఖరు లేదా ఆగస్టులో ప్రారంభించి పేదలకు అన్నదానం చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ మాజీ ఛైర్మన్ వైపి.రమేష్, శర్మాస్ తదితరులు ఉన్నారు.

రోడ్లపై ఆవులు.. రాకపోకలకు ఇబ్బందులు..!



రోడ్లపై సంచరిస్తున్న ఆవులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం పట్టణంలో ప్రధాన రహదారులు, కూడళ్లలో నిత్యం ఆవులు సంచరిస్తూం ఉండ డం, గుంపులుగా ఉండడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పశువులను రోడ్లపై వదలకుండా ఇళ్ల వద్ద ఉంచుకోవాలని మున్సిపల్ అధికారులు హెచ్చరికలు జారీ చేసినా పశువుల యజమానులు పట్టించుకోవడం లేదు. స్థానిక వినాయక కూడలి, తేరుబజార్, కూరగాయల మార్కెట్, లక్ష్మీబజార్, కణేకల్ రోడ్డు, కోట ముఖద్వారం, తదితర ప్రాంతాల్లో నిత్యం పదుల సంఖ్యలో పశువులు సంచరిస్తూ రోడ్డుపై పడుకుని ఉంటాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ప్రధానంగా కూరగాయల మార్కెట్ వద్ద కూరగాయల వ్యర్థాలు, చెత్త కుండి రోడ్డుపైనే ఉండడంతో వాటిని తినేందుకు పశువులు అక్కడ పెద్దఎత్తున గుమి కూడి ఉంటాయి. పశువుల దెబ్బకు ఓబుళాచారి రోడ్డులో వాహనంపై వెళ్లాలంటే ప్రజలు భయభ్రాంతు లకు గురవుతున్నారు. ఇకనైనా పోలీసులు, మున్సిపల్ అధికారులు పశువుల యజమానులకు తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేయడంతో పాటు వారు పట్టించుకోని పక్షంలో పశువులను బందలదొడ్డికి తరలించడం లేదా పెద్ద మొత్తంలో జరిమానా విధిస్తే సమస్య పరిష్కారం అవుతుందని పట్టణ ప్రజలు భావిస్తున్నారు.

ప్రాణాలను నిలిపే రక్తదానం

కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రమాదంలో గాయపడినా, అనారోగ్యంతో ఉన్న వారికి రక్తదానం చేయడం వల్ల వారి జీవితాన్ని నిలపొచ్చని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని అనంతపురం జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని ఓల్డ్‌టౌన్‌లో ఉన్న రెడ్ క్రాస్ సొసైటీ ఆఫీస్‌లో శుక్రవారం నాడు రక్తదాన శిబిరాల నిర్వాహకులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రెడ్‌క్రాస్ సొసైటీ అనంతపురం బ్రాంచ్ అధ్యక్షులు, కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర సభ్యులు కాపు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్‌పర్సన్ కాపు భారతి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సప్తగిరి క్యాంపర్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో రెడ్ క్రాస్ సొసైటీ ఆవరణలో ఏర్పాటుచేసిన శుద్ధజల కేంద్రాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలన్నారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరూ హీరోలే అన్నారు. రక్తం అందించి ప్రాణాపాయంలో ఉన్నవారి ప్రాణాలను కాపాడాలన్నారు. మహిళలు ప్రసవం సమయంలో రక్తం అందక చాలా ఇబ్బందులకు గురవుతుంటారని, అలాంటి సమయంలో రక్తం అందించి తల్లీబిడ్డ ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. అనంతరం రెడ్ క్రాస్ సొసైటీ సంస్థకు తమవంతుగా సేవలు అందించిన సప్తగిరి కాంపర్ వైస్ ప్రెసిడెంట్ హనీఫ్, జిల్లా వైద్యాధికారి డా॥ఈబి.దేవి, డిసిహెచ్ఎస్ డా॥పాల్ రవికుమార్, డిఎల్ఎటిఒ అనుపమ జేమ్స్, ఆలంబన జనార్ధన్‌లను కలెక్టర్ సన్మానించారు. గత సంవత్సరం కాలంలో రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థల సహకారంతో రక్తదాన శిబిరాలు నిర్వహించిన నిర్వాహకులకు జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్‌తో పాటు వివిధ సంస్థల ప్రతినిధులు, రెడ్ క్రాస్ నిర్వహణ కమిటీ సభ్యులు, రక్త దాతలు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకున్ని అభినందిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

'ఎడారీకరణ నివారణ ఎలా' .?
17న ఎఫ్ ఎకాలజీ ఆధ్వర్యంలో సదస్సు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం కరువులు-ఎడారీకరణ నివారణ అన్న అంశంపై ఈనెల 17వ తేదీన సదస్సు నిర్వహించనున్నట్టు ఎఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ వైవి.మల్లారెడ్డి తెలిపారు. అనంతపురం నగరంలోని స్థానిక ఎఎఫ్ ఎకాలజీ కేంద్రంలో శుక్రవారం ఉదయం జరిగిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. జూన్ 17వ తేదీన ప్రపంచ కరువులు-ఎడారీకరణ నివారణ దినోత్సవం ఏటా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రకృతిలో వస్తున్న మార్పులతో ఏటా దేశ భూభాగం యాభై శాతం వరకు కరువులకు గురవుతున్నాయన్నారు. దేశంలో చూసినప్పుడు అనంతపురం జిల్లా నిత్యం కరువులకు నిలయమన్నారు. వరుస కరువులతో ఇక్కడ వ్యవసాయం దుర్లభమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రానురాను సాగుభూమి తగ్గుతుపోతోందని చెప్పారు. ఇది ఆందోళనకరమై అంశమని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కరువు నివారణపై దృష్టి సారించాల్సిన అవసరముందన్నారు. ఇప్పుడు కరువు నివారణ చర్యలుంటున్నా ఒక సమగ్రమైన ప్రణాళికతో లేవని చెప్పారు. రాబోయే రోజుల్లోనైనా ప్రభుత్వాలు శాశ్వత కరువు నివారణకు దీర్ఘకాలికమైన ప్రణాళికలు తీసుకొచ్చి చర్యలు చేపట్టాల్సిన అవసరముందని వివరించారు. ఇటువంటి అంశాలను ఈ ప్రపంచ కరువు నివారణ దినోత్సవం సందర్భంగా చర్చకు వచ్చేందుకు వీలుగా తాము ఈ సదస్సును ఈనెల 17వ తేదీన నిర్వహించాలని తలపెట్టినట్టు చెప్పారు. అనంతపురం నగరంలోని పంగల్‌రోడ్డు సమీపంలోనున్న ఆర్డీటీ సమ్మిళిత పాఠశాలలో ఈ సదస్సు నిర్వహించాలని తలపెట్టినట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి క్రీడా రిటైర్డు డైరెక్టర్ బండి వెంకటేశ్వర్లు ప్రధానోపన్యాసకులుగా హాజరవుతారని తెలిపారు. ఈయనతోపాటు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌తోపాటు పలువురు ప్రముఖులు, రైతులు హాజరుకానున్నట్టు వివరించారు. కావున ఈ కార్యక్రమానికి అందరూ హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎఫ్ ఎకాలజీ చీఫ్ ఆఫ్ ఆపరేషన్స్ జె.మురళీకృష్ణ, కమ్యూనికేషన్ బాధ్యులు సుసర్ల రమేష్‌లు పాల్గొన్నారు.

'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్' రద్దుపై హర్షం

ప్రజాశక్తి-రాయదుర్గం

టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు సిఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే 'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్' రద్దు ఫైలుపై సంతకం చేయడం పట్ల స్థానిక న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శుక్రవారం టిడిపి లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి లోకానంద ఆధ్వర్యంలో న్యాయవాదులు కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. రైతుల పట్ల శాపంగా మారిన ఈ చట్టాన్ని రద్దు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు హరికృష్ణారావు, నాగరాజు, జాన్సన్, పృథ్వీ, మమత, టిడిపి పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, డి.హీరేహాల్ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

నిరుద్యోగులకు మెగా డీఎస్సీ వరం

ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

ప్రజాశక్తి-శింగనమల

ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టాగానే చంద్రబాబు మెగా డీఎస్సీ దస్త్రంపై మొదటి సంతకం చేయడం నిరుద్యోగులకు వరం అని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో ఐదు ఫైళ్లపై చంద్రబాబు చంద్రబాబు సంతకాలు చేయడాన్ని హర్షిస్తూ అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ప్రమాణం చేసిన సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాన్, రాష్ట్ర మంత్రులకు శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎన్‌డిఎ కూటమి అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ఫైల్‌పై మొదటి సంతకం చేశారన్నారు. అదికూడా 16,347 పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు. దీంతోపాటు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పెన్షన్ల పెంపు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, స్కిల్ సెన్సెస్ దస్త్రాలపై సంతకాలు చేశారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజే పలు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకోవడం పట్ల ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లాయర్ ఈశ్వర్‌రెడ్డి, ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, డేగల కృష్ణమూర్తి, చిదానందనాయుడు, చితంబరి దొర, అమ్మలదిన్నె శాలిని, గుత్తా ఆదినారాయణ, అట్టే రామాంజనేయులు, మారుతీనాయుడు, అట్టే శ్రీనివాసులు, పెరవలి రాము, డ్రిప్పు ఓబులేసు, బండి వెంకటనారాయణ, నరేష్, అనిల్, శంకరయ్య, పుల్లయ్య, సురేంద్రయాదవ్, ఎంపిడిఒ రమణ, సిడిపిఒ ఉమాశంకరమ్మ, ఎపిఒ శ్రీదేవి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు..

త్వరలో అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తాం..: అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో దళారీల మాటలు నమ్మి ఎవరూ మోసపోవద్దని అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ సూచించారు. శుక్రవారం అనంతపురంలోని పాతూరు, రైల్వేస్టేషన్ సమీపంలో అన్న క్యాంటీన్లను పరిశీలించారు. పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న క్యాంటీన్లను వెంటనే మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకు ఏ పని కావాలన్నా 24 గంటలూ తాను అందుబాటులో ఉంటానన్నారు. త్వరలోనే అన్నా క్యాంటీన్లను తెరిచి మళ్లీ పేదలకు తక్కువ ధరకే భోజనం అందిస్తామన్నారు. కాగా పింఛన్ల పెంపదలపై వృద్ధులు, మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ దగ్గుపాటికి మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా దగ్గుపాటి మాట్లాడుతూ నిన్నటి వరకూ రాష్ట్రం అంధకారంలో ఉందన్నారు. ఇప్పుడు చంద్రబాబు రూపంలో వెలుగు వచ్చిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఐదు హామీల మీద ఆయన సంతకాలు చేశారని అన్నారు. ఇప్పటి వరకు జగన్ ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేదన్నారు. కానీ చంద్రబాబు ఒకే రోజు 16,347పోస్టులు భర్తీ చేసేలా తొలి సంతకం చేశారన్నారు. ఇక నుంచి రాష్ట్రంలో ఒక సుపరిపాలన చూస్తారని భరోసా ఇచ్చారు. నగరంలో కొందరు నాయకులు పదవులు, బదిలీలు ఇతర పనులు చేయిస్తామని నా పేరు చెబితే ఎవరూ నమ్మవద్దన్నారు. అలాంటివి మీకు ఎదురైతే నా దష్టికి తీసుకుని రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు గంగారామ్, గాజుల ఆదేన్న, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీ నరసింహులు, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంఘ తేజస్విని, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాలర్ బాషా, నగర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, 12 వ డివిజన్ కార్పొరేటర్ జనబలం బాబా ఫక్రుద్దీన్, మాజీ కార్పొరేటర్లు గుర్రం నాగభూషణం, పావురాల చంద్రశేఖర్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి లక్ష్మీనరసింహా, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి, టిడిపి మాజీ నగర అధ్యక్షుడు కృష్ణకుమార్, పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కూచిహరి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, రాయలసీమ బలిజ సంఘం యువజన అధ్యక్షుడు తొండపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

నేరాలు ఘోరాలు

ఇసుక టిప్పర్ల పట్టివేత

పట్టుబడిన టిప్పర్లు

శింగనమల : మండలం మీదుగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని ఉల్లికల్లు గ్రామం వద్ద ఉన్న పెన్నానది నుంచి రాత్రివేళల్లో ఇసుక తరలిస్తున్నట్లు సమచారం రావడంతో రాత్రి 12 గంటల సమయంలో మండలంలోని నాయనపల్లి క్రాస్ వద్ద దాడి చేసి టిప్పర్లను పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించి మైన్స్ జిల్లా అధికారి నాగయ్యకు రిపోర్టు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్..

పుట్లూరు : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెద్దపప్పూరు మండలానికి చెందిన నాగేంద్ర తన ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకోవడంతోపాటు నాగేంద్రను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు వివరించారు.

మహిళ ఫిర్యాదు

పుట్లూరు : మండల పరిధిలోని కడవకల్లు గ్రామానికి చెందిన మిద్దెల చిన్న సిద్దయ్య అసభ్యంగా ప్రవర్తించాడని గ్రామానికి చెందిన జయలలిత శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు.. కడవకల్లుకు చెందిన చిన్న సిద్దయ్య ఎస్సీ కులానికి చెందిన మహిళలతో అసభ్యంగా ప్రవర్తించి నానాబూతులు తిట్టాడని వాపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్, సైకిల్ ఢీ.. ఇద్దరు బాలురకు గాయాలు

రాయదుర్గం : పట్టణంలోని కణేకల్ రోడ్డులో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బాలురు గాయపడ్డారు. మండలంలోని రాతిబావి వంక గ్రామానికి చెందిన హర్షవర్ధన్, సంపత్‌నాయక్ సైకిల్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మోటార్ సైకిల్ ఢీకొనడంతో వారిద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని హుటాహుటిన రాయదుర్గం ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు.

మానవత్వానికి ప్రతీక రక్తదానం

మేయర్ మహమ్మద్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు రక్తదానం చేసేందుకు ముందుకురావడం మానవత్వానికి ప్రతీక అని మేయర్ మహమ్మద్ వసీం కొనియాడారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరపాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో పలువురు రక్తదాతలను సన్మానించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థలోని పలువురు సిబ్బంది పదుల సార్లు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. రోడ్డు ప్రమాదాలకు గురైన వారు, అనారోగ్యానికి గురై అత్యవసర పరిస్థితుల్లో సరైన సమయానికి రక్తం దొరక్క చాలామంది ప్రాణాలు కోల్పోతుంటారన్నారు. అలాంటి వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వాసంతి, కార్పొరేటర్లు బాలాంజినేయులు, అనిల్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ కమిషనర్ హరిబాబు, ఇఇ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలను సన్మానించిన మేయర్ మహమ్మద్ వసీం, నాయకులు

ఖరీఫ్ సాగుకు సమాయత్తంకండి

జిల్లా వ్యవసాయాధికారులు

ప్రజాశక్తి-శింగనమల

సకాలంలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తం కవాలని జిల్లా వ్యవసాయ అధికారులు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో 'ఖరీఫ్ సాగుకు సమాయత్తం కండి' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిడిఎ మద్దులేటి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో నేల ఆరోగ్యం క్షీణించి సేంద్రియ కర్బనం అత్యల్ప స్థాయికి పడిపోయిందన్నారు. తిరిగి పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా అవసరమన్నారు. ఇందులో భాగంగా పశువుల పేడను వాడాలన్నారు. అలాగే పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ, పిల్లిపెసర, పెసర, మినుము సాగు చేసి భూమిలో కలియదున్నాలన్నారు. వీటితోపాటు జిప్సం వాడకం వల్ల నేల ఉదజని సూచిక మెరుగు పడుతుందన్నారు. ఎడిఎ శైలజ మాట్లాడుతూ భూమిలోకి వర్షం నీరు ఇంకేవిధంగా ఒంటిమడకతో భూమిని వాలుకు అడ్డంగా దున్నుకోవాలన్నారు. ప్రతిరైతు సాగుకు ముందు విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. వేరుశనగ స్రింట్ 3 గ్రాములు, కిలో వేరుశనగ విత్తనాన్ని కలిపి శుద్ధి చేసుకోవాలన్నారు. ట్రీకోడర్మ విరిడీ కిలో వేరుశనగ విత్తనానికి 8 గ్రాములు కలిపి శుద్ధి చేసుకుంటే వేరుకుళ్లను నియంత్రించుకోవచ్చన్నారు. అలాగే ఎకరాకు రెండు కిలోల ట్రీకోడర్మ విరిడీని 90 కిలోల పేడ, 10 కిలోల వేపపిండితో కలుపుకొని రెండువారాల పాటు గోనెసంచులు కప్పి నిల్వ ఉంచి, తర్వాత భూమిలో కలియదున్నాలన్నారు. వర్షం పడినప్పుడు వేరుశనగ విత్తిన 30 రోజుల తర్వాత లేదా 50 రోజుల తర్వాత ట్రీకోడెర్మని భూమిలో పైపాటుగా వేసుకోవచ్చన్నారు. వేరుశనగ చుట్టూ జొన్నని రక్షక పంటగా నాలుగు వరుసలు వేసుకోవాలన్నారు. తద్వారా చీడపీడల ఉధృతిని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి సైంటిస్ట్ కిశోర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి అన్వేష్‌కుమార్, మండల ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని 1వ రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి చెన్న వీరస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం సాగుకు సమాయతం అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వేరుశనగ, కంది, మొక్కజొన్న, వరిపంటల సాగుపై అవగాహన కల్పించారు. అలాగే విత్తన శుద్ధి, సాగులో పాటించాల్సిన ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్యం, సస్యరక్షణపై క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ ఉప సంచాలకులు మద్దిలేటి, సహాయ వ్యవసాయ సంచాలకులు శైలాకుమారి, రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిషోర్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శింగనమలలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

విద్యార్థుల కిట్లను తరలిస్తున్న అధికారులు

విద్యార్థులకు కిట్లు పంపిణీ

బెలుగుప్ప : మండలంలోని స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం నుంచి ఎన్.గుండ్లపల్లి కాంప్లెక్స్ పాఠశాలకు శుక్రవారం విద్యార్థుల కిట్లు పంపిణీ చేసినట్లు మండల విద్యాధికారులు మల్లారెడ్డి, హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్.గుండ్లపల్లి కాంప్లెక్స్ పరిధిలోని ఉన్న పాఠశాలలతోపాటు బెలుగుప్ప కాంప్లెక్స్ పరిధిలో ఉన్న కొన్ని పాఠశాలల విద్యార్థులకు (బ్యాగ్స్, టెస్ట్ బుక్స్, నోట్ బుక్స్, బెల్ట్ తదితర వస్తువులు) కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే గంగవరం కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాల, కాలువపల్లి కాంప్లెక్స్ పరిధిలో ఉన్న పాఠశాలకు శనివారం పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలతో చిన్నారులకు ఉజ్వల భవిష్యత్తు

ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు, చిన్నారులు

వజ్రకరూరు : అంగన్వాడీలతో చిన్నారులకు ఉజ్వాల భవిష్యత్తు సాధ్యమని సచివాలయ మహిళా పోలీస్ చంద్రకళ అన్నారు. గురువారం విడపనకల్ మండల పరిధిలోని హవలిగి అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ టీచర్లు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అంగన్వాడీల్లో నిర్వహించే ప్రీస్కూల్ కార్యక్రమాలపై తల్లులకు అవగాహన కల్పించారు. రెండున్నరేళ్ల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్వాడీల్లో చేర్పించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు అంబిక, బి.నాగవేణి, రుద్రమణి, ఎం.నాగవేణి, పి.శశికళ, హెచ్.సుమతి, ఆయాలు, కిషోర బాలికలు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో సమీక్ష

బెలుగుప్ప : ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో నూతన ప్రభుత్వం ఏర్పాటయ్యాక మండలంలోని 14 గ్రామాల సచివాలయ సిబ్బందితో మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా నూతన మార్గదర్శకాలు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్ స్కీం, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లతో ఎంపిడిఒ సుబ్బరాజు సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ హరిత, దస్తగిరి, వెంకటనారాయణ, అమర్‌నాథ్, శివప్ప, సాయిశ్రీ, శివ, రుద్ర, సాయిరామ్, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ సుబ్బరాజు

'అమిగోస్' అవినీతిపై విచారణ చేపట్టాలి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వైసిపి హయాంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో భూగర్భగనులు, మైన్స్, మట్టి, ఇసుక తదితర అంశాల్లో అమిగోస్ కంపెనీ పాల్పడిన అవినీతి అక్రమాపై సమగ్ర విచారణ చేయాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ డొల్ల పరిపాలనంతా ఒక్కొక్కటి బయటకు వస్తాయన్నారు. ఇందులో భాగంగా భూగర్భ గనులు, మైన్స్‌లో చేపట్టిన అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయని వివరించారు. భూగర్భగనుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన బాధ్యతలను అధికారులను కాదని అమిగోస్ అనే కంపెనీకి 2 సంవత్సరాలకు అప్పగించి రూ.259 కోట్లకు కాంట్రాక్ట్ చేసుకుందన్నారు. కాంట్రాక్ట్ ప్రకారం సదరు కంపెనీ 2 సంవత్సరాలకు నెలకు రూ. 11 కోట్ల చొప్పున ప్రభుత్వానికి చెల్లించేలా కాంట్రాక్ట్ ఇచ్చారని తెలిపారు. ఆ కంపెనీ ఇష్టారాజ్యాంగా ఎంతైనా వసూలు చేసుకునె వెసులుబాటును గత ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ కాంట్రాక్ట్ అంతా గోప్యంగా జరిగిందన్నారు. రాష్ట్రంలో ప్రయివేట్ వ్యక్తులు నిర్వహించే మద్యం వ్యాపారాన్ని వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం ఆధీనంలో నడిపి తహశీల్దార్లు, ఉపాధ్యాయులను మద్యం షాపుల వద్ద విధులు కేటాయించి దేశ సమగ్రతను భద్రతను కాపాడుతున్నామనే రీతిలో వ్యవహరించిందన్నారు. అదే ప్రభుత్వ పర్యవేక్షణలో జరగాల్సిన భూగర్భ గనులు, మైన్స్ పనులను మాత్రం ప్రయివేట్ సంస్థలకు అప్పగించి రూ.కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టారని మండిపడ్డారు. ఇష్టారీతిన చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి మట్టి, ఇసుక, గ్రానైట్, వంటి సహజ వనరులను దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పందించి అమిగోస్ కంపెనీ వ్యవహారంపై విచారణ జరపాలన్నారు. రూ.259 కోట్ల కుంభకోణం బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎంతటి వారు ఉన్నా శిక్షించాలని, ఆ డబ్బులు వసూలు చేసి జిల్లా అభివృద్ధికి వినియోగించాలని కోరారు. ఈ కుంబకోణంపై అవసరమైన కోర్టులను ఆశ్రయిస్తామన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ప్రభాకర్‌చౌదరి

బోయలపల్లి కేశవరెడ్డికి డాక్టరేట్

అనంతపురం : శ్రీసత్యసాయి జిల్లా తలమర్లకు చెందిన బోయనపల్లి కేశవరెడ్డికి డాక్టరేట్ లభించింది. 'ఎన్విరాన్సింగ్ స్టూడెంట్ టీచర్ ఇంటరాక్షన్ త్రూ టాస్క్ బేస్డ్ టీచింగ్ అమాంగ్ అండర్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్ ఆఫ్ సెలెక్ట్ డిగ్రీ కాలేజెస్ ఇన్ రాయలసీమ రీజియన్' అనే అంశంపై ఎస్ఎస్‌బిఎన్ కళాశాల విశ్రాంత ప్రొఫెసర్ కె.గోపాల్‌రెడ్డి, జెఎన్‌టియు హుమానిటీస్ విభాగం ఆచార్యులు, డైరెక్టర్ ఉమెన్ ఎంపోరుమెంట్ ప్రొఫెసర్ వి.బి.చిత్ర పర్యవేక్షణలో పరిశోధన చేసినందుకు కేశవరెడ్డికి జెఎన్‌టియు శుక్రవారం డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. కేశవరెడ్డికి ఆంగ్ల అధ్యాపకుడిగా నగరంలో వివిధ డిగ్రీ కళాశాలల్లో సుదీర్ఘ బోధనా అనుభవం ఉంది. ఈయన ప్రస్తుతం కడప ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల్లో ఆంగ్ల అధ్యాపకుడిగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు అభినందించారు.

హోంమంత్రి అనితకు అభినందనలు

నార్పల : చంద్రబాబు మంత్రివర్గంలో రాష్ట్ర హోంమంత్రిగా దళిత ముద్దుబిడ్డ అనిత వంగలపూడి బాధ్యతలు చేపట్టడం పట్ల ఎంఆర్‌పిఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ శింగనమల తాలూకా అధ్యక్షులు రంగాపురం పుల్లప్ప మాట్లాడుతూ చంద్రబాబు మాదిగ బిడ్డలను గుర్తించి హోంమంత్రి పదవి ఇచ్చినందుకు సంతోషకరమన్నారు. అదేవిధంగా అనిత మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు జయరామ్, రమణ, రాజు, రాజగోపాల్, శ్రీరాములు, గోపాల, నారాయణ, కుళ్లాయప్ప, గంగయ్య, ప్రసాద్, పలువురు దళిత సోదరులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల పెంపుపై హర్షం

గుత్తి : సామాజిక పింఛన్లు పెంచుతూ సిఎం చంద్రబాబు సంతకం చేయడం పట్ల పింఛన్‌దారులు శుక్రవారం గుత్తిలో సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా గుత్తి ఆర్ఎస్‌లో టిడిపి జిల్లా కార్యదర్శి పి.శ్రీకాంత్‌చౌదరి ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధాప్య పింఛన్ రూ.4వేలు, వికలాంగుల పింఛన్ రూ.6వేలతోపాటు వివిధ రకాల పింఛన్లు పెంచడం ఆనందదాయకమన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో అర్హులందరికీ లబ్ది చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు, పింఛన్‌దారులు

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై హర్షం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికలలో ఇచ్చిన హామీకి అనుగుణంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తూ సంతకం చేయటాన్ని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఆ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తరిమెల నాగరాజు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రైతులలో తీవ్రమైన ఆందోళన కలిగించిందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్ ఆదేశాల మేరకు గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం రైతులకు మేలు చేసే అంశాల కంటే, నష్టం కలిగించే అంశాలే ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతకం చేయడం ఆనందంగా ఉందన్నారు.

రైతులను ఆదుకోండి..

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైందని, గత సంవత్సరం జిల్లాలో ఏర్పడ్డ కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులు విత్తనాలు, ఎరువులు, ఖరీఫ్ పంటలు పెట్టుబడుల కొరకు తీవ్రమైన ఆందోళనతో ఉన్నారు, కాబట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తక్షణమే ఆదుకోవాలని కోరారు. ఎన్నికలలో హామీ ఇచ్చినట్లుగా పంట పెట్టుబడులకు రైతులకు ఇస్తామన్న రూ.20 వేలు పెట్టుబడి సహాయాన్ని రైతులకు అందించి, రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు వ్యవసాయ శాఖ ద్వారా అందించి రైతులను ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

తాడిపత్రి : వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు రద్దు చేయడం హర్షణీయమని ఎపి రైతుసంఘం నాయకులు రాజారామిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రైతుల్లో తీవ్రమైన ఆందోళన కలిగించిందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్ ఆదేశాల మేరకు గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం రైతులకు మేలు చేసే అంశాల కంటే, నష్టం కలిగించే అంశాలే ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో గడిచిన ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేస్తూ ఐదు సంతకాల్లో ఒకటి చేయడం సంతోషకరమన్నారు. అదేవిధంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో తీవ్ర నష్టాల్లో కూరుకుపోయిన రైతులకు పెట్టుబడుల కోసం రైతులకు ఇస్తామన్న రూ.20 వేల పంట పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుత్తి : గుత్తి, పెద్దవడుగూరు మండలాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎపిఎస్‌పిడిసిఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సాయిశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 220 కెవి సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతులు చేయనున్న దృష్ట్యా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ పెద్దవడుగూరు, గుత్తి మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

నార్పల : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ప్రయివేటు పాఠశాలలకు ధీటుగా సౌకర్యాలు ఉన్నాయన్నారు. అంతేగాకుండా అర్హులైన ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారన్నారు. కావున ప్రయివేటు పాఠశాలల వెంట పడకుండా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లిగన్న, నర్సింహులు, శ్రీవాణి, మెహతాజ్, తదితరులు పాల్గొన్నారు.

7న ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం

పామిడి : వచ్చేనెల 7న తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు కుమారస్వామి, లాలెప్ప శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డిఎకు మద్దతు ఇచ్చి అధికారంలోకి వచ్చేందుకు కృషి చేశారన్నారు. ఈనేపథ్యంలో జూలై 7న నిర్వహించనున్న ఆవిర్భావ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శివ, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

వేలంపాట వాయిదా

నార్పల : నార్పల మేజర్ పంచాయతీ వేలాలు నిర్వహణ వాయిదా వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నార్పల గ్రామ పంచాయతీకి సంబంధించిన ఆదాయ ప్రతిఫలమిచే బస్టాండు, వారపు సంత, మూత్రశాలలు, మరుగుదొడ్లకు ఈనెల14న వేలంపాట నిర్వహించనుండగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు తెలిపారు. ఇందుకు అనుగుణంగా తిరిగి ఈనెల 19న వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు.

పూలహారాలు, శాలువాలు తేవొద్దు.. : దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వారంరోజులుగా తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు ఎంతో ఖర్చు వెచ్చించి పూల హారాలు, శాలువాలు తీసుకొస్తున్నారని దయచేసి ఇక వాటిని తీసుకురావద్దని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు చాలా మంది వస్తున్నారని ఇది తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కానీ ఎంతో ఖర్చు వెచ్చించి పులహారాలు, శాలువాలు తీసుకొని రావటం నాకు కొంత బాధ కలిగించిందని అన్నారు. ఇకపై వాటి స్థానంలో మొక్కలు, పుస్తకాలు, పెన్నులు తీసుకొని రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు పెంచాలన్న సందేశాన్ని ఇచ్చే విధంగా ఆయన నిర్ణయం తీసుకున్నారు. అలాగే పుస్తకాలు, పెన్నులు, తీసుకుని రావడం వల్ల పేద విద్యార్థులకు అవి అందించే వీలు ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు ఇకపై తన వద్దకు వచ్చేటప్పుడు మొక్కలు, పుస్తకాలు, పెన్నులు మాత్రమే తీసుకొని రావాలని కోరారు.

ఉషోదయ పాఠశాలను సీజ్ చేయాలి

ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

వజ్రకరూరు : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఉరవకొండలోని ఉషోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌ను సీజ్ చేయాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘం జిల్లా కన్వీనర్ చిరంజీవి, కో కన్వీనర్ భీమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఉషోదయ ఇంగ్లీష్ మీడియం పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాలలో పనిచేస్తున్న ఓ టీచర్‌తో విద్యార్థి సంఘం నాయకుల్ని అవహేళనగా మాట్లాడించడం బాధాకరమన్నారు. స్కూల్ యాజమాన్యం వారు విద్యా సంవత్సరం పూర్తిగా ముందే అక్రమంగా అడ్మిషన్లు, స్కూల్ యూనిఫామ్, స్టేషనరీ అమ్ముతున్నారన్నారు. అంతేకాక పర్మిషన్‌లేని హాస్టల్ నడుపుతూ ఒకే క్యాంపస్‌లో రెండు వేర్వేరు విద్యాసంస్థలు నడుపుతూ క్వాలిఫైడ్ లేని టీచర్స్‌తో టీచింగ్ చేయిస్తున్నారన్నారు. కావున వెంటనే పాఠశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు మురళి, సతీష్, విజయ్, వంశీ, కిరణ్, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.